బడిబాట విజయవంతం చేయండి

• సమీక్ష సమావేశంలో అధికారులు



భీమారంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాధా రాథోడ్

నెన్నెల: బడిబాటలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 3 నుంచి 19 వ తేదీ వరకు బడి బాట నిర్వహించాలన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు తేడా వివరించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు మండలంలోని 19 పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలను సిద్ధం చేసి అందజేశారు. మిగతా 11 పాఠశాలలో విద్యార్థుల యూనిఫాంలను పాఠశాలల ప్రారంభానికి ముందుగానే అందజేయనున్నట్లు చెప్పారు. మండల నోడల్ అధికారి ప్రకాశ్ రావు, డీటీ ప్రకాశ్, ఏపీఎం విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దండేపల్లి: బడిబాటను విజయవంతం చేయాలని తహసీల్దార్ సంధ్యారాణి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బడిబాటపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అందరూ సమన్వయంతో ముందుకుసాగి బడీడు పిల్లలను పాఠశాల ల్లో చేర్పించాలన్నారు. ఎంపీడీవో ప్రసాద్, ఏపీఎం బ్రహ్మయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు విజయలక్ష్మి, చిన నర్సయ్య, ఎంఐఎస్ నగేశ్, సీఆర్పీలు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: అన్ని పంచాయతీల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి సురేఖ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చూడాలన్నారు. ఎంపీవో ప్రసాద్, ఐకేపీ ఏపీఎం లక్ష్మి, ఏవో ప్రభాకర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

భీమిని: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ గంగామోహన్ పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా సమాఖ్య సభ్యులతో ఆయన మాట్లాడారు. ఈనెల 3 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీవో సబ్దర్‌అలీ, ఏపీఎం ప్రకాశ్, ఏపీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్(తాండూర్): సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. మండలంలో బడి బాట మండల స్థాయి సమావేశం నిర్వహించారు. మండల నోడల్ అధికారి మల్లేశం, ఏపీఎం పోమానాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యదర్శులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

భీమారం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎంపీడీవో రాధారాథోడ్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బడిబాట కార్యక్రమంపై ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో శాఖల అధికారులు పాల్గొంటారని వివరించారు. తహసీల్దార్ సదానందం, నోడల్ ఆధికారి సురేష్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ పాల్గొన్నారు.

కాసిపేట: బడిబాట విజయవంతం చేయాలని ఎంపీవో సత్యనారాయణసింగ్, నోడల్ అధికారి రమేశ్ కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో బడిబాట కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీవో నాగరాజు, ఏపీఎం వెంకటేశ్వర్లు , ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

వేమనపల్లి: అన్ని పంచాయతీల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించాలని ఎంపీవో బాపురావు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, హెచ్‌ఎం ఆధ్వర్యంలో గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకుని షెడ్యూల్ తయారు చేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, ఏపీఎం ఉమారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జన్నారం: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బడిబాట కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బడి బాటలో చేపట్టే అంశాలను తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, ఎంఈవో విజయ్‌కుమార్ వివరించారు. ఎంపీవో రమేశ్, ఏపీఎం బుచ్చయ్య, ఏఎస్సై బిక్ష నాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెచ్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



దండేపల్లి: మాట్లాడుతున్న తహసీల్దార్ సంధ్యారాణి



కాసిపేట: మాట్లాడుతున్న ఎంపీడీవో



భీమినిలో మాట్లాడుతున్న ఎంపీడీవో

క్లుప్తంగా

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి



వర్షమాపక కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నస్పూర్: వర్షాకాలంలో అధికారులు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో మండలానికి సంబంధించి ఏర్పాటు చేసిన రెవెన్యూ వర్షమాపక కేంద్రాన్ని ముఖ్యప్రణాళిక అధికారి జి.సత్యం, నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. వర్షమాపకం నేటి నుంచి నిరంతరాయంగా పనిచేస్తోందని తెలిపారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేశామన్నారు.

సీపీఎం సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేస్తున్న నాయకులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ బస్టాప్ వద్ద బస్‌షెల్టర్, పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు ప్రయాణికుల నుంచి శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి మిడివెల్లి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సీసీసీ కార్నర్ వద్ద బస్టాప్ నుంచి వివిధ ఏరియాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. బస్టాప్ వద్ద టాయిలెట్లు లేక మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వర్షాకాలం దృష్ట్యా శాశ్వత బస్‌షెల్టర్, సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరిగెల మహేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అభినవ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మండల పూజ



పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక రాళ్లపేట్ రోడ్‌నెంబర్-1లో శివపంచాయతన ఆలయంలో మండల పూజను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు రాంభట్ల శశాంక్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యావచనం, ఋత్వీకరణం, పంచవగవ్య ప్రాశన, కలశస్థాపన, మహాభిషేకం బలిప్రదానం, పూర్ణాహుతి తదితర పూజలు జరిగాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులు

బెల్లంపల్లిరూరల్(తాండూర్): తాండూర్ మండల మెడికల్ అండ్ జనరల్ స్టోర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జగన్మోహన్ చారి, ఉపాధ్యక్షుడిగా బి.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కె.సంతోష్ కుమార్, కోశాధికారిగా టి.రామ్‌ప్రసాద్, గౌరవ అధ్యక్ష, సలహాదారులుగా టి.సాంబమూర్తి,పి.శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా శ్రీధర్, తిరుపతి, సంతోష్, శ్రీనివాస్, జగదీశ్, టింకు, కుమార్, అనిల్, సురేందర్, రాజశేఖర్, వెంకటస్వామి, శేఖర్ ఎన్నికయ్యారు.

బీమా చెక్కు అందజేత

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లికి చెందిన నగావత్ దేవా ప్రమాదవశాత్తు మృతిచెందగా అతడి భార్య సమ్మక్కకు శుక్రవారం తపాలాశాఖ అధికారులు రూ.10 లక్షల బీమా చెక్కును అందజేశారు. గతంలో రూ.399 పోస్టాఫీస్‌లో బీమా చెల్లించగా రూ.10 లక్షల బీమా వర్తించింది. మంచిర్యాల తపాలాశాఖ ఏఎస్పీ రామారావు, ఐపీపీబీ బ్రాంచి మేనేజర్ వెంకటస్వామి, అసిస్టెంట్ మేనేజర్ సాగర్, మాజీ సర్పంచ్ ఆలోత్ లక్ష్మిప్రియ, నగావత్ కళ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొగాకు వాడకం మానుకోవాలి

మందమర్రిరూరల్: ప్రపంచం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల పీహెచ్‌సీలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు వాడకం మానాలని వైద్యాధికారి రమేశ్ తెలిపారు. అనంతరం పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. వైద్యసిబ్బంది గంగాధర్, భవాని, ప్రీతి, రేవతి, స్రవంతి, మంజుశ్రీ ఉన్నారు.

పత్తి విత్తనాల పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి



తనిఖీ చేస్తున్న కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో పంట సాగుకు ఉపయోగించే పచ్చిరొట్ట, పత్తి విత్తనాల పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ బాదావత్ సంతోశ్ అన్నారు. హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. అదేవిధంగా హాజీపూర్‌లోని మల్లికార్జున ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ తనిఖీ చేసి, పత్తి విత్తనాలు, ఎరువుల స్టాక్ వివరాలను పరిశీలించారు. నిషేధిత విత్తనాలు, ఎరువుల విక్రయాలు జరిపే వారిపై చట్టనీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ సాంకేతిక అధికారి సంకె శ్రీనివాస్, ఏవో కృష్ణ, పీఏసీఎస్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

బెల్లంపల్లిరూరల్(తాండూర్): తాండూర్ మండలంలోని విత్తన, ఎరువుల దుకాణాల్లో ఏవో జి.కిరణ్మయి, సీఐ కుమారస్వామి శుక్రవారం తనిఖీ చేశారు. విత్తనాలు, స్టాక్ రిజస్టర్‌లు, బిల్ బుక్స్, ఎరువులను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వ గుర్తింపు పొందిన, నాణ్యమైన విత్తనాలు విక్రయించాలన్నారు. నిషేధిత నకిలీ, నాసిరకం విత్తనాలు రైతులకు అంటగడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు విక్రయించే సమయంలో రైతులు, దుకాణాదారుల సంతకాలతో కూడిన రసీదులు అందించాలన్నారు. వర్షాధారిత పంటలు సాగు చేయాలన్నారు. ఏఈవో శంకర్, సిబ్బంది ఉన్నారు.



తాండూర్ మండలంలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

లక్సెట్టిపేట: మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. రైతులకు విత్తనాలను ఎమ్మార్పీ ధరకు మించి అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ఏవో చల్ల ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విత్తనాలు అధిక ధరకు అమ్మితే చర్యలు

బెల్లంపల్లిరూరల్: ఫెర్టిలైజర్ దుకాణదారులు విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని బెల్లంపల్లి మండల ఇన్‌చార్జి వ్యవసాయాశాఖ అధికారి డి.వందన హెచ్చరించారు. కన్నాల రైతువేదికలో బెల్లంపల్లి, కాసిపేట మండలాల ఫెర్టిలైజర్ డీలర్లకు పలు అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిషేధిత, నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన, నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. విత్తన డీలర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను కొని మోసపోవద్దు

భీమిని: రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని భీమిని ఏడీఏ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. మండలంలోని పెద్దపేట గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు పత్తి విత్తనాలు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాలన్నారు. ఏవో విజయ్‌కుమార్, ఏఈవో వినోద్‌కుమార్ ఉన్నారు.

కాలినడకన కొండగట్టుకు

జన్నారం: నేడు హనుమాన్ జయంతిని పురస్కరించుకుని దీక్ష విరమణ కోసం భక్తులు కాలినడకన కొండగట్టుకు బయల్దేరారు. జన్నారానికి చెందిన 15 మంది బయల్దేరి వెళ్లారు. స్థానిక భక్తులు వారిని సాగనంపారు.



అపూర్వ సమ్మేళనం

దండేపల్లి: మండలంలోని ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-96 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం కలుసుకున్నారు. 28 ఏళ్ల తర్వాత వీరి అపూర్వ సమ్మేళనానికి పాఠశాల వేదికైంది. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమెరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి, జ్ఞాపికలు అందించారు.

కలమడుగు విద్యార్థులకు అభినందన

జన్నారం: మండలంలోని కలమడుగు పాఠశాల నుంచి జాతీయ ఉపకార వేతనాల ఎంపికలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలువడంతోపాటు జిల్లా స్థాయి మొదటి, రెండవ ర్యాంకులు సాధించిన జశ్వంత్, రాజేశ్, టెన్త్ ఫలితాల్లో 9.8 పాయింట్లు సాధించిన ఎల్యూసి రఘును కలెక్టర్ బాదవత్ సంతోష్ శుక్రవారం తన చాంబర్‌లో అభినందించారు. అదనపు కలెక్టర్ రాహుల్, డీఈవో యాదయ్య వారితోపాటు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. హెచ్‌ఎం కట్ట రాజమౌళి ఉన్నారు.



జన్నారం: అభినందిస్తున్న కలెక్టర్

మంచిర్యాలలో క్రీడాకారులకు..

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన సిలంబం క్రీడాకారులను కలెక్టర్ బదావత్ సంతోశ్ శుక్రవారం అభినందించారు. గత మే 25 నుంచి 28వ తేదీ వరకు మలేషియాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి సిలంబం ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పులిశెట్టి శృతి(గోల్డ్, సిల్వర్), దొంతుల వర్ష(గోల్డ్, సిల్వర్), బోసు సంతోశ్(సిల్వర్) మెడల్ సాధించడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. సిలంబం రాష్ట్ర కార్యదర్శి కనపర్తి రమేశ్, జిల్లా అధికారుల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, డీవైఎస్‌వో రాజ్‌వీర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోచంపల్లి వెంకటేశ్ పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

జైపూర్: పోలీసులు కొత్త చట్టాలపై అవగాహన ఉండాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో గల ప్రాణహిత అతిథి గృహంలో శుక్రవారం పోలీసులు, సిబ్బందికి కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. జూలై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర న్యాయచట్టాలు అమల్లోకి తీసుకువస్తున్న క్రమంలో కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన కొత్త విధానాలను తెలుసుకోవాలన్నారు. జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయం పోలీస్ స్టేషన్ల పరిధిలో తెలంగాణ పోలీస్ అకాడమీలో నూతన చట్టాలపై శిక్షణ పొందిన ఉన్నతాధికారులతో బ్యాచ్‌ల వారీగా నెల రోజులు శిక్షణ ఉంటుందన్నారు. సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: తీవ్ర ఎండల్లో తమ సిబ్బందిని అడ్మిషన్ల కోసం తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులు స్వేచ్ఛగా నచ్చిన కళాశాలల్లో చేరకుండా మాయమాటలతో అడ్మిషన్లు చేయిస్తున్నారని ఆరోపించారు.

టీచర్ల బదిలీలు, పదోన్నతులు పూర్తిచేయాలి

మంచిర్యాలఅర్బన్: వేసవి సెలవుల్లోనే టీచర్ల బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. మంచిర్యాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. న్యాయపరమైన అటంకాలు తొలగిపోయినందున అర్ధంతరంగా నిలిపివేసిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పున:ప్రారంభించాలన్నారు. కేజీబీవీ, యుఆర్ఎస్ సమగ్రశిక్ష ఉద్యోగులందరికీ బేసిక్ పే ఇవ్వాలన్నారు. అసంపూర్తిగా ఉన్న మన ఊరు-మనబడి పనులకు నిధులు కేటాయించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు, రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి రాష్ట్ర కమిటీ సభ్యులు రామన్న, శ్రీనివాస్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు నర్సయ్య, కార్యదర్శులు కిరణ్‌కుమార్, సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు జైపాల్, చక్రవర్తి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట మత్స్యకారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జన్నారం మండలం కిష్టాపూర్ ఊర చెరువులోని భూమిని కొందరు కబ్జా చేసి పట్టా చేసుకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మత్స్యకారులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 46 ఏళ్లుగా ఊర చెరువును నమ్ముకొని 80 కుటుంబాలను జీవనోపాధి పొందుతున్నాయన్నారు. కొందరు కబ్జాదారులు అక్రమించుకొని చెరువు భూమిని వ్యవసాయ మార్చుకుంటున్నారని తెలిపారు. చెరువు విస్తీర్ణం, శిఖం తగ్గి జీవనోపాధి కోల్పోతున్నామన్నారు. మత్స్యకారులు నర్సయ్య, సత్తయ్య,లింగన్న, భీమరాజు, చంద్రయ్య, రాజేశం, అశన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



దంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న డీపీవో

వేమనపల్లి: ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని డీపీవో వెంకటేశ్వర్లు సూచించారు. నీల్వాయి పంచాయతీలోని డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, ప్రకృతివనాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. డంపింగ్‌యార్డులో కంపోస్ట్ ఎరువును తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. క్యాతన్‌పల్లి, నీల్వాయి ప్రకృతి వనాలను పరిశీలించారు. ఎంపీవో బాపురావు, పంచాయతీ కార్యదర్శులు అశోక్, జాఫర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ముగిసిన మజ్జిగ ఉచిత పంపిణీ

మంచిర్యాలటౌన్: పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో నెలన్నర క్రితం మంచిర్యాల మహిళా తరంగిణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, మజ్జిగ పంపిణీ కేంద్రం శుక్రవారంతో ముగిసింది. మమత అధ్యక్షురాలు రాచకొండ మంజుల, కార్యదర్శి ఇరుకుల లత, మమత సభ్యులు జ్యోత్స్న చంద్రదత్, భారతి, జ్యోతి, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

జన్నారం: కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతనెల 1 నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. 30 మంది విద్యార్థులకు వాలీబాల్‌లో మెలకువలు నేర్పిస్తూ శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎం కట్ట రాజమౌళి, పీడీ బోర్లకుంట సాగర్ ఆధ్వర్యంలో శిక్షణ అందజేశారు. అంతర్గత పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్లు అందజేసినట్లు పీడీ సాగర్ తెలిపారు.

పాఠశాల పనుల పరిశీలన

భీమిని: మండలంలోని వీగాం కేజీబీవీ పాఠశాల పనులను ఎంపీడీవో గంగామోహన్ శుక్రవారం పరిశీలించారు. పాఠశాల ప్రారంభంలోపే పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం వీగాంలోని విద్యార్థుల యూనిఫాం కేంద్రాన్ని పరిశీలించి 5వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. ఏపీఎం ప్రకాశ్, వీవో అధ్యక్షులు రాజుబాయి, నాగమ్మ, సీసీలు శోభ, వసంత్ ఉన్నారు.

జైపూర్: రామారావుపేట, ఇందారం, కుందారం, గంగిపల్లి గ్రామాల్లో గ్రామాల్లో చేపడుతున్న అమ్మ-ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి డీఆర్‌డీవో కిషన్ పరిశీలించారు. అదేవిధంగా మహిళా సంఘాలు చేపడుతున్న పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

భీమారం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసే ఏకరూప దుస్తులను స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఎంపీడీవో రాధా రాథోడ్ శుక్రవారం ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఐకేపీ ఏపీఎం త్రియంబక్, సిబ్బంది ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

జైపూర్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1996-97 పూర్వ విద్యార్థులు తోటి స్నేహితుడు దుర్గం మధుకర్ కుటుంబానికి శుక్రవారం రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. మధుకర్ తండ్రి ఇటీవల మరణించగా తోటి స్నేహితుడికి పూర్వవిద్యార్థులు తిరుపతి, సురేందర్‌రెడ్డి, మల్లేశ్, సత్యనారాయణ, సాయిబాబా తదితరులు పొనూర్‌కు వెళ్లి ఈ నగదును అందించారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీకి తాగునీటిని అందించే ముల్కల్ల పంప్‌హౌజ్ వద్ద మరమ్మతు దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటలకు విద్యుత్ సరఫరాను ని లిపివేతతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ మధుకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నా రు. ఈవిషయాన్ని ప్రజలు సహకరించాలని కోరారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

మందమర్రిరూరల్: ఏరియాలోని సింగరేణి హై స్కూల్ మైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో క్రీడాకారులకు నెల రోజులు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమానికి జీఎం మనోహర్ హాజరై వారికి దుస్తులు పంపిణీ చేశారు. ఎస్వో టూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ ఉన్నారు.

ఇంటి పన్ను సవరణకు సహకరించాలి



ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్: పట్టణంలో ప్రతి ఐదేళ్లకోసారి ఇంటి పన్నుల సవరణలో భాగంగా జనరల్ సర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గోదావరి నదిలో నీటి ఎద్దడి ఉన్నా పట్టణ ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని అన్నారు. కొందరు ఒక ఫ్లోర్‌కు అనుమతి తీసుకుని, అదనంగా మరిన్ని ఫ్లోర్లు కట్టి పన్ను చెల్లించడం లేదన్నారు. ఇంటి పన్ను ఎక్కువగా వచ్చినవారు, మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక ఇంటి నంబర్‌పై ఎన్ని పోర్షన్లు ఉంటే అన్ని నల్లా కనెక్షన్లు ఇస్తామన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి రూపాయికే నల్లా కనెక్షన్ ఇస్తామని తెలిపారు. ప్రజలను మభ్యపెట్టి డబ్బులను కొందరు దళారులు వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి, మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని పట్టణ ప్రజలను కోరారు.

దళారులపై చర్యలేవి?

చెన్నూర్: వరిధాన్యం కొనుగోలు పేరుతో రైతులను దోచుకుంటున్నా దళారులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో శుక్రవారం నిర్వహించిన రైతు సంఘం ఏరియా సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో నిర్వాహకులు 8 కిలోలు, రైస్‌మిల్లర్లు 2 కిలోల చొప్పున కటింగ్ చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండడంతో ప్రభుత్వం రైతులకు పెట్టుబడిసాయం రూ.15 వేలు, రూ.2 లక్షల రుణమాఫీ అందించాలన్నారు. రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 7న చెన్నూర్‌లో రైతు సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం రైతు సంఘం ఏరియా కమిటీ కన్వీనర్‌గా చందు, కోకన్వీనర్‌గా కుందారపు చంద్రన్న, సిడాం కిష్టయ్య, పేదం పద్మ, ఆత్రం శ్రావణ్‌కుమార్‌ను నియమించారు.